క్లుప్తంగా

దశాబ్ది ఉత్సవాలపై నేడు సమీక్ష

తుక్కుగూడ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలపై మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో చైర్మన్ మధుమోహన్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వెంకట్రామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్లు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన సూచించారు.

మహాధర్నాకు తరలివెళ్లిన వీఓఏలు



కందుకూరు: హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద ఐకేపీ వీఓఏలు చేపట్టిన మహాధర్నాకు సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో సోమవారం మండలానికి చెందిన వీఓఏలు పెద్దఎత్తున తరలివెళ్లారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటాన్ని ఆపేదిలేదన్నారు. కార్యక్రమంలో వీఓఏలు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్



తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తుక్కుగూడ: ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్, కౌన్సిలర్ రవినాయక్ సూచించారు. సోమవారం మున్సిపాలిటీ కేంద్రంలోని 10వ వార్డులో రెడ్యూస్ రియూస్ రీసైకేష్లన్ (ఆర్‌ఆర్‌ఆర్) కేంద్రాన్ని వారు ప్రారంభించారు. తడి,పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అప్పగించాలన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా తాము ప్రతి వార్డులో ప్రజలకు అవగాహన కలిపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ పెద్దఅంబర్‌పేట, లక్ష్మారెడ్డిపాలెం ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డీఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెంకటాపూర్‌లో కంటివెలుగు శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ వెంకటాపూర్‌లో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత,స్థానిక కార్పొరేటర్ భారతమ్మ ప్రారంభించారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనివాస్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొలువుదీరిన నూతన పాలక మండలి



నూతన పాలక మండలి సభ్యులు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ నూతన పాలక మండలి సోమవారం కొలువుదీరింది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్, ఈఓ మురళీకృష్ణ సభ్యులతో ఆలయంలో ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులుగా వెంకటేష్ వాల్మీకి, పద్మ, కృష్ణ, సహదేవ్, అశోక్, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా అర్చకుడు సుధీర్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కమిటీ చైర్మన్‌గా వెంకటేష్‌వాల్మీకిని ఎన్నుకున్నారు. పాలక మండలి సభ్యులను 11వ డివిజన్ కార్పొరేటర్ శివకుమార్, బీఆర్‌ఎస్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు నరేందర్ గౌడ్, దాత దామోదర్, విద్యాకమిటీ చైర్మన్ రాజుగౌడ్, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కమిటీకి ఏడాది కాలపరిమితి ఉంటుందని ఈఓ తెలిపారు.

బంజారుల సంక్షేమానికి కృషి



సబితారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గిరిజన నాయకులు

మంత్రి సబితారెడ్డి

- నియోజకవర్గంలో బంజారా భవన్ నిర్మాణానికి నిధుల మంజూరు

మహేశ్వరం: తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా మహేశ్వరంలో బంజారుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్, దుర్గమ్మ ఆలయాల నిర్మాణం చేస్తున్నామని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరంలోని సంత్ సేవాలాల్ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి రూ.కోటి రూపాయలు మంజూరు చేసినందుకు సోమవారం నగరంలోని ఆమె నివాసంలో బీఆర్‌ఎస్ గిరిజన నాయకులు, బంజారా సంఘం నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సంత్ సేవాలాల్, దుర్గమ్మ ఆలయాలను ఇంద్రారెడ్డి ట్రస్టు, దాతల సహకారం, ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్నామన్నారు. యాదగిరిగుట్ట ఆలయ నిర్మాణానికి వాడిన శిల(రాయి)ని సేవాలాల్ ఆలయ నిర్మాణానికి వాడుతున్నారన్నారు.

బీటీ రోడ్లకు నిధుల మంజూరు..

నియోజకవర్గ కేంద్రంలో బంజారా భవన్ నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులను మంజూరు చేశామన్నారు. మండలంలోని గిరిజన తండాల నుంచి గ్రామాలకు కలిపేందుకు బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.9.41 కోట్ల నిధులను మంజూరు చేశామని త్వరలో టెండర్లు పిలిచి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. మహేశ్వరం–మన్సాన్‌పల్లి వయా ఉప్పుగడ్డ తండా వరకు రూ.3.21 కోట్ల నిధులను మంజూరు చేశామన్నారు. మన్సాన్‌పల్లి–కోళ్ల పడకల్ వయా ఘట్టుపల్లి బీటీ డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.15.20 కోట్ల నిధులు విడుదల చేశామని త్వరలో టెండర్లు పిలిచి రోడ్డు పనులు ప్రారంభిస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్రారెడ్డి ట్రస్టు చైర్మన్ కార్తీక్‌రెడ్డి, సంత్ సేవాలాల్ ఆలయ కమిటీ చైర్మన్ సీతారామ్‌నాయక్, వైస్ ఎంపీపీ సునీతానాయక్, మాజీ జెడ్పీటీసీ ఈశ్వర్ నాయక్, కేసీ తండా, ఎన్డీ తండాల సర్పంచ్‌లు మోతీలాల్ నాయక్, రాజునాయక్, తుక్కుగూడ కౌన్సిలర్ రవినాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవినాయక్, బీఆర్‌ఎస్ నాయకులు అంగోత్ కృష్ణ నాయక్, విఠల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే చేరికలు..

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో మంత్రి సబితారెడ్డి చేస్తున్న అభివృద్ధి చూసి యువకులు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎం.ఎ.హుస్సేన్ అన్నారు. ఎర్రకుంటకు చెందిన ఇబ్రహీం నహదీ, అహ్మద్ నహదీ, సొహేల్, అబ్దుల్ అజీజ్, గఫార్ ఖురేషీ తదితరుల అనుచరగణం పెద్దఎత్తున మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. జల్‌పల్లిని అన్నివిధాల అభివృద్ధి చేస్తున్న మంత్రి సబితారెడ్డి నాయకత్వానికి ప్రతిఒక్కరూ అండగా నిలవాలన్నారు. బీఆర్‌ఎస్ బలోపేతానికి తమవంతు కృషిచేస్తామన్నారు.

మహేశ్వరంలో కాంగ్రెస్ జెండా ఎగరాలి



రేవంత్‌రెడ్డితో మహేశ్వరం కాంగ్రెస్ నాయకులు

- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

మహేశ్వరం: మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్‌తో పాటు పలువురు నాయకులు నగరంలోని రేవంత్‌రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ... నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి మహేశ్వరం గడ్డపైన కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని సూచించారు. తెలంగాణలో కూడా కర్ణాటక ఫలితాలే వస్తాయన్నారు. కేంద్రం, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకొని అధికారంలోకి వస్తోందని దీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజల్లో ఎండగట్టి చైతన్యవంతం చేయాలని నాయకులకు సూచించారు. కాంగ్రెస్ నాయకులుప్రవీణ్, శ్రీకాంత్, యాదగిరి, హరికృష్ణ పలువురు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప జాతర



బీరప్పస్వామి, కామరాతిదేవి కల్యాణోత్సవంలోని ఓ ఘట్టం

కందుకూరు: మండల పరిధిలోని బేగంపేటలో సోమవారం బీరప్ప జాతర ఘనంగా నిర్వహించారు. జాతరలో భాగంగా బీరప్పస్వామి, కామరాతి దేవి కల్యాణోత్సవాన్ని పెద్మకుర్మ బండ చంద్రయ్య, సెల్వోజీ బాలం రాములు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ గోవర్ధన్, ఉప సర్పంచ్ రవీందర్, ఎంపీటీసీ సభ్యుడు బాల్‌రాజ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ విజేందర్‌రెడ్డి, డైరెక్టర్లు గౌర పర్వతాలు, ఆనంద్, మాజీ ఎంపీటీసీ ఈశ్వర్‌గౌడ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, ప్రభాకర్, నరేందర్, రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్‌చారి, నాయకులు రమేష్‌గౌడ్, సత్తయ్య తదితరులు మొక్కులు చెల్లించుకున్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటం

- కాంగ్రెస్, సీపీఎం నేతల ధర్నా

కడ్తాల్: ఇళ్లులేని నిరుపేదలకు ప్రభుత్వ స్థలంలో ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి తహసీల్దార్ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో ఇళ్లులేని నిరుపేదలు అనేక మంది ఉన్నారని కడ్తాల్ గ్రామశివారులో సర్వేనంబర్ 644లో 3.03 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని.. ఈ భూమిలో ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్లస్థలాలు కేటాయించి, ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే వరకు కాంగ్రెస్ పార్టీ వారి పక్షాన పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్, నాయకులు మల్లయ్య, భానుకిరన్, యాదయ్య, రమేశ్, బుచ్చయ్య, శ్రీను, శ్రీకాంత్, రంగ, వెంకటయ్య, అజ్గర్‌అలీ, రాజేందర్‌గౌడ్, రాజేశ్, కృష్ణ, ఇమ్రాన్‌బాబా తదితరులు ఉన్నారు.



కడ్తాల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సీపీఎం ఆధ్వర్యంలో..

తుర్కయంజాల్: అర్హులందరికీ ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. రాగన్నగూడలోని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం ఆ పార్టీ మున్సిపల్ కన్వీనర్ డి.కిషన్ అధ్యక్షతన చేపట్టిన ధర్నాలో యాదయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాల కోసం ఇప్పటికే 4వేల మంది దరఖాస్తు చేసుకున్నారని.. వాటిని పరిశీలించి అందరికీ స్థలాలు కేటాయించాలన్నారు. ప్రభుత్వ సర్వే నంబర్లలోని భూములను ప్రభుత్వమే హెచ్‌ఎండీఏ ద్వారా వేలం వేయించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం దారుణమని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రభుత్వ భూముల్లో పేదల చేత గుడిసెలు వేయిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ సూపరింటెండెంట్ జ్యోతికి మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవిత, జిల్లా కమిటీ సభ్యులు నర్సింహ, నాయకులు సత్యనారాయణ, భాస్కర్, శంకర్, ఆశీర్వాదం, ప్రకాష్ కారత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యంగిర అమ్మవారి సేవలో ఎమ్మెల్యే గాంధీ

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురంలోని కుర్తాళం పీఠం, శ్రీ ప్రత్యంగిర దేవిని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, విప్ అరెకపూడి గాంధీ దంపతులు దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజ లు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కుర్తాళం పీఠాధిపతులు గొప్ప సిద్ధపురుషులని, ఎన్నో హిందూ ధర్మ సంరక్షణ కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. వారి అనుగ్రహం వల్ల అందరికీ అమ్మవారి కృపాకటాక్షాలు లభిస్తున్నాయన్నారు. భారత దేశంలోనే ప్రసిద్ధి చెందిన మహిమాన్విత ప్రత్యంగిర అమ్మవారి ఆలయం హైదరాబాద్ లో ఉండటం మన అందరి అదృష్టమన్నారు. ఆలయ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సెక్రటరీ శ్రీని వాస్, నాగేంద్ర చౌదరి, విఠల్ శర్మ, శ్రీసాయికుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే దంపతులకు ప్రసాదం అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 23, వంకాయ 28, బెండ 28, పచ్చిమిర్చి 40, కాకర 45, బీర 45, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 13, కారెట్ 35. దొండ 18, ఆలు 20, ఉల్లి 13, గోకర 40, దోస 18 సొర 15, పొట్ల 13, అరటి 10, చిక్కుడు 55, అర్వి 33, మునగ 48, చిలగడ దుంప 47, బీట్‌రూట్ 19, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 75, కాప్సికమ్ 55. గమనిక: మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

వాటర్ ట్యాంకు ప్రారంభం

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజలకు వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూసుకుంటామని నాగన్‌పల్లి సర్పంచ్ జగన్, ఎంపీటీసీ చెరుకూరి మంగ రవీందర్ పేర్కొన్నారు. రామోజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన ట్యాంకును సోమవారం సర్పంచ్ జగన్, ఎంపీటీసీ చెరుకూరి మంగ రవీందర్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు లక్షా యాభైవేల లీటర్ల మంచినీటి ట్యాంకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. వాటర్ ట్యాంక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిన తెలంగాణ ప్రభుత్వానికి,రామోజీ ఫౌండేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మణ్‌రావు,ఉప సర్పంచ్ బీరప్ప, వార్డు సభ్యులు రాజు, లింగస్వామి, సునీత, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు పక్కదారి: సీపీఎం

మంచాల: నిరుపేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ సరుకులు అక్రమంగావిక్రయాలు చేపడుతున్నట్లు .. వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేసింది. సోమవారం మంచాల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డికి ఈ మేరకు వారు వినతిపత్రం అందజేశారు. జాపాల గ్రామంలో అర్ధరాత్రి వేళ అక్రమంగా రేషన్ సరుకులు విక్రయించేందుకు యత్రించిన మల్లప్పపై వెంటనే చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ.. జాపాల గ్రామంలో 22వ రేషన్ డీలర్‌గా బకున ఉమా ఉండగా ఆమె బదులు మల్లప్ప రేషన్‌సరుకులు విక్రయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. గతంలో కూడా కిరోసిన్, రేషన్ సరుకులు అమ్ముకు న్నట్లు విమర్శలు ఉన్నాయని తెలిపారు. ప్రజలకు చెందాల్సిన రేషన్ సరుకులు పక్కదారి పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం గ్రామ కన్వీనర్ యాట పాండు, మండల కమిటీ సభ్యులు హఫీజ్, లెనిన్, కార్యదర్శులు హరికృష్ణ, ప్రభాకర్ పాల్గొన్నారు.



అప్రాయి చెరువు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

సాగునీటి రంగానికి అధిక నిధులు

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

తలకొండపల్లి: రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేసి నూతన ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతున్నామన్నారు. మండల పరిధిలోని చీపునుంతలలోని అప్రాయి చెరువు మరమ్మతు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. రూ.74 లక్షలతో మరమ్మతు పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.

ప్రజారోగ్యమే లక్ష్యం..

మండల కేంద్రానికి చెందిన శ్రీశైలం గత కొన్ని రోజులుగా డయాలసిస్ సమస్యతో బాధపడుతూ అనారోగ్యానికి గురయ్యారు. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సహకారంతో శ్రీశైలానికి రూ.2,50,000 ఎల్‌ఓసీ చెక్కు మంజూరైంది. సోమవారం చీపునుంతల్లో బాధితుడికి ఎమ్మెల్యే చెక్కు అందజేశారు. అదేవిధంగా ఎడవెల్లికి చెందిన లక్ష్మయ్యకు మంజూరైన రూ. 40,000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే బాధితుడికి అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసురెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, కుమార్‌గౌడ్, నరోత్తంరెడ్డి, సర్పంచ్ రఘుపతి, శ్రీను, వెంకటయ్య, మల్లారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు నుంచి విముక్తి



బండిరేగుల వద్ద పూర్తయిన కల్వర్టు నిర్మాణం

పూర్తయిన మునుగనూరు–హయత్‌నగర్ కల్వర్టు

- వారం రోజుల్లో అందుబాటులోకి తెస్తామంటున్న అధికారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

హయత్‌నగర్: వర్షాకాలం వచ్చిందంటే చాలు వరద నీరు కారణంగా తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని మూడు గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులు తప్పేవికావు. మాసబ్ ట్యాంక్ చెరువు నుంచి వచ్చే వరద మునుగనూరు–హయత్‌నగర్ రోడ్డుపై బండిరేగుల వద్ద పెద్దఎత్తున ప్రధానరోడ్డుపై నుంచి పారుతుండటంతో మూడేళ్లుగా కొహెడా, తొర్రూర్, మునుగనూరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇక్కడ పెద్ద కల్వర్టును నిర్మించి వరదనీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు ఏళ్లుగా అధికారుల దృష్టికి తీసుకురావడంతో ప్రజల అవస్థలను దృష్టిలో ఉంచుకుని గతేడాది అక్టోబర్ నెలలో కల్వర్టు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇందుకు జీహెచ్‌ఎంసీ సుమారు రూ.78 లక్షల నిధులు మంజూరు చేసింది. అయితే వరదల కారణంగా పనుల్లో కొంతకాలం అంతరాయం ఏర్పడింది. ఇటీవల వేగంగా పనులు చేపట్టడంతో ఎట్టకేలకు కల్వర్టు నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. మూడు రోజుల్లో చిన్నచిన్న పనులు పూర్తిచేసి జూన్ మొదటి వారంలో అందుబాటులోకి తెస్తామని అధికారులు తెలిపారు. వర్షాకాలం మొదలు కాకముందే కల్వర్టు నిర్మాణం పూర్తి చేయడం పట్ల మూడు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులుండవన్నారు.

రాకపోకలు బంద్ అయ్యేవి



బండిరేగుల వద్ద వరదనీరు తరుచుగా రోడ్డుపైకి వచ్చేది. దీంతో మా గ్రామానికి రాకపోకలు బంద్ అయ్యేవి. 6 నెలలుగా కల్వర్టు జరుగుతుండటంతో ప్రత్యామ్నాయ రోడ్డు నుంచి వెళ్తున్నాం. ఎట్టకేలకు కల్వర్టు నిర్మాణం పూర్తిచేయడం అభినందనీయం.

– అంజయ్య, మునుగనూరు

మూడు రోజుల్లో పూర్తి

మునుగనూరు–హయత్‌నగర్ ప్రధాన రహదారిపై బండిరేగుల వద్ద మాసబ్ చెరువు వరద రోడ్డుపూవ పారి వాహనాల రాకపోకలు నిలిచిపోయేవి. తాజాగా కల్వర్టు నిర్మాణం పూర్తయ్యింది. కేవలం బీటీ వేసే పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. మూడు రోజుల్లో బీటీ పనులు పూర్తిచేస్తాం. పై అధికారుల సూచన మేరకు కల్వర్టును ప్రజలకు త్వరలో అందుబాటులోకి తెస్తాం.

– నరేంద్రతేజ, ఏఈ, జీహెచ్‌ఎంసీ

ఆలయ పనులను త్వరగా పూర్తిచేయండి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని ప్రసిద్ధిగాంచిన ఖిల్లామైసమ్మ ఆలయ అభివృద్ధిపై విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఆలయాభివృద్ధి కోసం మంజూరైన కోటి రూపాయలతో చేపట్టబోయే పనులపై దేవాదాయశాఖ డీఈ ఓంప్రకాశ్ మంత్రికి వివరించారు. ఆలయ ఆధునీకరణ పనులను త్వరితగతిన చేపట్టాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, ఆలయ కమిటీ చైర్మన్ గొడుగు శ్రీనివాస్, సభ్యులు మురళీధర్‌రెడ్డి, సునీల్ యాదవ్, వలిగొండ దీపు, ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

తరుగు పేరుతో రైతులకు ఇబ్బందులు

- మాడ్గుల బీజేపీ అధ్యక్షుడు పెద్దయ్య

ఆమనగల్లు: మాడ్గుల మండల కేంద్రంలోని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మాడ్గుల మండల బీజేపీ అధ్యక్షుడు పెద్దయ్యయాదవ్, మండల బీజేపీ కిసాన్‌మోర్చా అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్ ఆరోపించారు. మాడ్గుల మండల కేంద్రంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం బీజేపీ నేతలు పరిశీలించారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా అనేక కారణాలు చూపుతున్నారని ఆరోపించారు. ప్రతి క్వింటాల్‌కు 5 కేజీల చొప్పున తరుగు పేరుతో తీసుకుంటున్నారని లేబర్ చార్జి పేరిట క్వింటాల్‌కు రూ.50 వసూల్ చేస్తున్నారని ఆరోపించారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం వద్దనే ఉంచుతున్నారని అకాలవర్షం వస్తే రైతులు నష్టపోతారని అన్నారు. వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కమలేశ్, శ్రీనివాస్, కాటంగౌడ్, శ్రీశైలం, మధు, కృష్ణ, యాదయ్య, జైపాల్‌రెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.